# పాఠశాలల అభివృద్ధికి ఎస్ఎంసీలే కీలకం



మాట్లాడుతున్న ఎంఈఓ విశ్వమోహన్

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** పాఠశాలల అభివృద్ధికి విద్యా కమిటీల క్రియాశీలక పాత్రే ఆధారమని ఎంఈఓ విశ్వమోహన్ పేర్కొన్నారు. మండలంలోని కౌతవరం ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో మండలంలోని 11 ఉర్దూ పాఠశాలలకు చెందిన ఎస్ఎంసీ సభ్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. పాఠశాలల ప్రగతికి ప్రభుత్వం అందించే నిధుల వినియోగం, సద్వినియోగం, పథకాల అమలు, నిర్వహణ, విద్యార్థుల హాజరు తదితర అంశాల్లో ఎస్ఎంసీ సభ్యులకు కీలకపాత్ర ఉందని ఎంఈఓ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్పీలు మంగ, రఫీపుల్లాలు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. పాఠశాల సముదాయక ఛైర్మన్ ఇర్ఫానుల్లా, సీఆర్పీ అనితారేచల్ పాల్గొన్నారు.

# తెదేపా గ్రామ కమిటీల ఎంపిక



బాబూరావు



పిచ్చేశ్వరరావు

**కౌతవరం(వెణుతురుమిల్లి), న్యూస్‌టుడే:** మండలంలోని కౌతవరం, వెణుతురుమిల్లి గ్రామ తెదేపా నూతన కమిటీలను మంగళవారం రాత్రి ఏర్పాటు చేశారు. మండల తెదేపా అధ్యక్షులు కొసరాజు బాపయ్యచౌదరి ఆధ్వర్యంలో జరిగిన గ్రామపార్టీ సభల్లో కౌతవరం తెదేపా అధ్యక్షుడిగా జిల్లా పాలసమితి డైరెక్టర్ వల్లభనేని బాబూరావు, కార్యదర్శిగా వీరంకి వీరరాఘవయ్య(నాని)లు, వెణుతురుమిల్లి తెదేపా అధ్యక్షుడిగా శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ కొప్పినేని పిచ్చేశ్వరరావు, కార్యదర్శిగా పామర్తి సత్యనారాయణలు ఎంపికైనట్లు ప్రకటించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మోహన్‌రావు, నియోజకవర్గ సభ్యుడు అడ్సుమిల్లి రామ్మోహన్‌రావు, తెదేపా నేతలు సుబ్రహ్మణ్యంచౌదరి, పాములు, హరిబాబు పాల్గొన్నారు.

# పంట పండింది

సాధారణంగా దాళ్వా సాగులో అధిక దిగుబడులు వస్తుంటాయి.. సార్వాలో దిగుబడులు తక్కువగా వస్తుంటాయి.. కానీ ఈ సారి సార్వాలో అత్యధిక దిగుబడులు వచ్చాయి. సార్వాలో సాధారణ దిగుబడులు మండలంలో ఎకరానికి 28 నుంచి 30 బస్తాలు ఉంటే గతేడాది కొన్ని చోట్ల 32 కూడా ఉండేది. ఈ ఏడాది సరాసరి ఎకరానికి 35 నుంచి 48 బస్తాల వరకు వచ్చాయి. కొన్ని చోట్ల ఇది 55 బస్తాల వరకు ఉండటం విశేషం. దీనికి సరిపడా నీరు, ఎండలతో ఆరుతడికి తోడు పట్టిసీమ ద్వారా సారవంతమైన గోదావరి జలాలు డెల్టా భూములను సస్యశ్యామలం చేశాయనేది రైతుల ఉవాచ.

- న్యూస్‌టుడే, గుడ్లవల్లేరు,

## సార్వాలో అధిక దిగుబడులతో రైతుల్లో ఆనందం

మండలంలో 25,525 ఎకరాల సాగుభూమి ఉంది. ఈ ఏడాది నాలుగు రకాలను 1061(60 శాతం), 2231(22 శాతం), 1381(8శాతం), స్వర్ణ(10) సాగు చేశారు. సార్వా సాగు ప్రారంభమయ్యే జూన్‌లో సాధారణ వర్షపాతం 101 మి.మీ ఉంటే ఏకంగా 434 మిమీ వర్షపాతం నమోదైంది. జులైలో 209కి 175, ఆగస్టులో 197కు 142, సెప్టెంబరులో 174కు 170, అక్టోబరులో 165కు 26 మి.మీ వర్షపాతం నమోదైంది. తొలి నెలలో తప్ప మిగతా నెలల్లో వర్షపాతం తక్కువగా ఉంది. అలాగే తొలి నెలల్లో కాల్వలకు నీరు చేరలేదు, తర్వాతే పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు పుల్లేరు ద్వారా పొలాలను తాకాయి. ఎక్కువ భాగం పొలాలు నీరు లేక సన్నగా నెర్రలిస్తున్న సమయంలో వర్షం కురవడం, లేకపోతే గోదావరి నీరు వచ్చేది. దీంతో పొలాలన్నీ ఆరుతడిగా మారాయి. దీని వలన మొక్క కుదుళ్లకు గాలి, సమపాళ్లలో నీరు చేరి బలంగా మారి మంచి దిగుబడులు వచ్చాయి. మండలంలోని కౌతవరం, గుడ్లవల్లేరు, వెణుతురుమిల్లి, మామిడికోళ్ల, డొకిపర్రు, చిత్రం, చినగొన్నూరు, పురిటిపాడు, శేరిదగ్గుమిల్లి, విన్నకోటల్లో అధిక, గతేడాది కన్నా ఎక్కువ దిగుబడులు వచ్చాయి. అంగలూరు, పెంజెంద్ర, కూరాడ, కుచికాయలపూడి, పోలిమెట్ల, శేరికల్వపూడి తదితర గ్రామాల్లో మాత్రం తక్కువ దిగుబడులు కన్పించాయి. డోకిపర్రులోని కొన్ని ప్రాంతాల్లో రైతులకు అత్యధికంగా 55, 56 బస్తాల దిగుబడి కూడా వచ్చినట్లు వ్యవసాయశాఖలో రికార్డయింది. మండలంలో ఈ సార్వాలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అధిక దిగుబడులు వచ్చాయని మండల వ్యవసాయాధికారిణి రమాదేవి పేర్కొన్నారు.



కుప్ప నూర్పిడిలో రైతులు, వ్యవసాయ కార్మికులు



ధాన్యంను బస్తాలకెత్తుతున్న రైతులు

### మంచి వాతావరణం...విత్తనాల నాణ్యతలే కారణం



1980 నుంచి వ్యవసాయం చేస్తున్నాను, ఎప్పుడూ సార్వా వరి సాగులో ఎకరానికి 30కి మించి దిగుబడులు రాలేదు. ఈ ఏడాది మొత్తం 25 ఎకరాలను సాగు చేశాను. నేడు నూర్పిడి చేస్తే ఎకరానికి 40కి తగ్గకుండా దిగుబడులు వచ్చాయి. దీంతో ఎకరానికి ₹ 20 వేలు ఖర్చులు అయినా, ఇంకా ఎకరానికి ₹ 21,500 మిగులుతోంది. మినుము సాగు కూడా ఉంది. కాబట్టి రైతులకు ఈ ఏడాది మంచి ఆదాయం వచ్చినట్లే. ఇంత దిగుబడులు రావడానికి కారణం దాళ్వా సాగు నాటి ఉండే ఎండ, తక్కువ వర్షపాతం, కాల్వల నీరు తక్కువ ఉండటంతో మొక్కకు, నేలకు సరిపడా తేమ, నీరు, ఎండ చేరి మంచి దిగుబడులు వచ్చాయి. అలాగే నాణ్యమైన, కొత్త విత్తనాలు కూడా దిగుబడులకు కారణమే.

- వడ్లమూడి రవీంద్రబాబు, కౌతవరం, రైతు

### గోదావరి జలాలతోనే..



గతంలో ఎప్పుడూ సార్వా వరిసాగులో ఇంత దిగుబడులు చూడలేదు. నేను మూడెకరాలు సాగు చేస్తున్నాను. ఎకరానికి ₹ 20 వేలు ఖర్చయ్యింది. నేడు ఎకరానికి 40 బస్తాల దిగుబడితో వచ్చింది. పెట్టుబడిపోను మిగులు ఉంటుంది. దీనికి గోదావరి నీరే కారణం. పట్టిసీమ ద్వారా ప్రభుత్వం పట్టుదలతో గోదావరి జలాలను డెల్టాకు తీసుకురావడంతో భూములు సారవంతమయ్యాయి. ఆ ఒండ్రు నీటితో తడవడంతో మన భూములు మంచి దిగుబడులు ఇచ్చాయి. దీంతో దాళ్వాలో తప్ప కన్పించని దిగుబడులు సార్వాలోనూ సాధ్యమయ్యాయి.

- బొర్రా నాగేశ్వరరావు, గుడ్లవల్లేరు, రైతు

# యోగాతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న డాక్టర్ సీఎల్ వెంకట్రావ్

**కౌతవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** యోగాకు అనేక వ్యాధులను తగ్గించేశక్తి ఉందని, ప్రతి ఇంటా యోగాను అలవాటు చేసుకునే దిశగా అందరూ కృషి చేయాలని స్వచ్ఛాంధ్రమిషన్ రాష్ట్ర వైస్‌చైర్మన్ డాక్టర్ సీఎల్.వెంకట్రావ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కౌతవరంలో ఓంసాయి దివ్యసత్సంగం ట్రస్ట్ నిర్వాహకులు కానూరి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ ధ్యానమందిరంలో ఏర్పాటు చేసిన ప్రేమసాయి అమృతయోగం ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యోగాతో అనేక వ్యాధులకు చికిత్సలు ఉన్నాయని రుజువైందని, అలాగే హోమియోలోనూ నేడు కొత్తగా యోగాను సమ్మిళతం చేసి కొన్ని రకాల వ్యాధుల నివారణకు కృషి జరుగుతోందన్నారు. ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు, ఆధ్యాత్మిక కేంద్రాలు ప్రతి ఇంటికీ యోగాను చేరేలా, చేర్చేలా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ సీఎల్ జ్యోతిప్రకాశనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ హోమియో కేంద్రం ఏడీ సీహెచ్.రవీందర్, జిల్లా పాలసమితి డైరెక్టర్ వల్లభనేని బాబూరావు, వైద్యులు రామచంద్రరావు, సుగుణావతి, సర్పంచి సుజాత, మండల భాజాపా అధ్యక్షులు వడ్లమూడి రవీంద్రబాబు, నీటిసంఘాధ్యక్షులు కానూరి సత్యంబాబు, పీహెచ్‌సీ ఛైర్మన్ చాపరాల జగన్మోహన్‌రావు, బొబ్బా నరసింహారావు, నిమ్మగడ్డ నరసయ్య, సూర్యదేవర లక్ష్మణరావు, తూము చలమయ్య, బాడిగ ఫణిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన గ్రామస్థులు

# ధ్యాన కేంద్రాలు మరిన్ని అవసరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ సిఎల్ వెంకట్రావు

**గుడ్లవల్లేరు:** గ్రామ గ్రామాన ధ్యాన కేంద్రాలు అవసరమని తద్వారా ప్రజలకు ఆరోగ్యం చేకూరుతుందని రాష్ట్ర స్వచ్ఛాంధ్ర మిషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సి.ఎల్. వెంకట్రావు అన్నారు. ఆదివారం కౌతవరం గ్రామంలో ప్రముఖ రేకి గురువు ప్రేమ్‌సాయిగురూజి (కెఆర్‌టి) ఆధ్వర్యంలో ప్రేమసాయి అమృతయోగం ఆత్మధ్యాన శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం ఆత్మధ్యానంతో సాధ్యమవుతాయని అన్నారు. ప్రేమ్‌సాయి గురూజి కౌతవరంలో ఏర్పాటు చేసిన ఈ ధ్యానకేంద్రాలు ఎంతో అవసరం అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పాల ఉత్పత్తిదారుల సంఘ డైరెక్టర్ వి.బి.కె బి. సుబ్బారావు, ప్రేమ్‌సాయి గురూజి, సొసైటీ అధ్యక్షులు చిట్టిబాబు, కానూరి సత్యంబాబు, చాపరాల జగన్‌మోహన్ రావు, సాంబశివరావు, డాక్టర్ జమ్ముల రామచంద్రరావు, సర్పంచ్ పడమటి సుజాత, డాక్టర్ సంఘమిత్ర మానేపల్లి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి Mon, 06 March 2017
epaper.andhrajyothy.com//c/17329316

# నార్ల తాతారావు



నార్ల తాతారావు ప్రఖ్యాత భారత విద్యుత్తు రంగ నిపుణుడు, పూర్వపు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విద్యుత్తు బోర్డు మాజీ ఛైర్మన్. నార్ల తాతారావు కృష్ణా జిల్లా కౌతవరం గ్రామంలో 1917 మార్చి 8వ తేదీన జన్మించాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్తు సంస్థ (ఏపీఎస్ఈబీ) డివిజనల్ ఇంజినీరుగా ఉద్యోగ జీవితం మొదలు పెట్టాడు. ఆ తర్వాత మధ్యప్రదేశ్ విద్యుత్తు బోర్డులో పనిచేసిన కాలంలో దేశంలోనే ఆ సంస్థను అగ్రగామిగా నిలిపాడు. థర్మల్ విద్యుత్తు కేంద్రాల డిజైన్లను మార్చడంద్వారా ఈ రంగంలో పెద్ద విప్లవమే తీసుకొచ్చాడు. ఆ తర్వాత ఆ డిజైన్లు దేశానికంతటికీ ఆదర్శమయ్యాయి. 1974 నుంచి 1988 వరకూ 14 ఏళ్లపాటు ఏపీఎస్ఈబీ ఛైర్మన్‌గా పనిచేసాడు. విద్యుత్తు రంగానికి విశిష్ట సేవలందించినందుకుగాను 1983లో కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. నాగార్జున సాగర్, శ్రీశైలం, దిగువ సీలేరు లలో విద్యుత్ ఉత్పాదక సామర్థ్యము పెంచడంలో ప్రముఖ పాత్ర వహించాడు. రైతులకు ఉచిత విద్యుత్తు ఇవ్వడాన్ని నార్ల తాతారావు గట్టిగా సమర్థించాడు. పేదలకు తక్కువ ధరకే విద్యుత్తు అందజేయాలనేది ఆయన లక్ష్యం. విద్యుత్తుతో వ్యాపారం చేయవద్దనేది ఆయన నినాదం.



పుల్లేరు కాలువ తీరు ఇది



కౌతవరం ప్రధాన లాకుల వద్ద గుర్రపు డెక్క

# తాగునీటి సరఫరాకు దారేదీ..?

## కాలువలో గుర్రపుడెక్కతో ఆందోళన

కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే

**మ**రో రెండు రోజుల్లో కాల్వలకు తాగునీటిని సరఫరా చేస్తామని ఇరిగేషన్ అధికారులు, పీసీ చైర్మన్ గుత్తా చంటి ప్రకటించినా ప్రధాన కాలువ పరిస్థితి గమనిస్తే గ్రామాలకు తాగునీరు చేరడంపై అనుమానం వ్యక్తమవుతోంది. తూర్పు కృష్ణా పరిధిలోని ప్రధాన లాకులు కౌతవరం. అక్కడి నుంచే మూడు కాల్వల ద్వారా గుడివాడ, కైకలూరు, పెడన, మచిలీపట్నం నియోజకవర్గాల్లోని వందలాది మంచినీటి చెరువులకు తాగునీరు చేరనుంది. ప్రస్తుతం కౌతవరం లాకుల నుంచి ఎగువకు రైల్వే వంతెన వరకూ దట్టంగా పట్టేసిన గుర్రపు డెక్క ఉండడంతో ఎగువ నుంచి వదిలే తాగునీరు ఎలా చేరగలదనే ప్రశ్న తలెత్తుతోంది. అధికారులు ముందు ఈ డెక్కను తొలగించే ప్రయత్నం చేస్తే వందలాది గ్రామాలకు త్వరగా తాగునీరు చేరి దాహార్తి తీరనుంది.

శనివారం 11 మార్చి 2017

# నాణ్యతతో రెగ్యులేటర్ నిర్మించండి



రెగ్యులేటర్ మార్కింగ్‌ను పరిశీలిస్తున్న సాంకేతిక నిపుణులు

**కౌతవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని కౌతవరం ఇరిగేషన్ పరిధిలో బంటుమిల్లి కాల్వలో నూతనంగా ₹ 1.25 కోట్లతో నిర్మించనున్న రెగ్యులేటర్ నిర్మాణ డిజైన్, మార్కింగ్‌ను శుక్రవారం రాష్ట్రప్రభుత్వ సాంకేతిక సలహాదారు బృంద సభ్యులు సత్యనారాయణ, సుబ్బారావులు పరిశీలించారు. గతేడాది నిర్మించిన రెగ్యులేటర్ గత నెలలో కుంగి బీటలు వారడంతో కొత్తది నిర్మించాలని అధికారులు ఆదేశించిన నేపథ్యంలో కాల్వలోనే కాస్త ముందుకు నిర్మాణ ప్రాంతాన్ని ఎంచుకొని మార్కింగ్ ఇచ్చారు. దీనిని వారు పరిశీలించి ఎప్పటికప్పుడు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ గతంలో వలే కాకుండా నిర్మించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్, ఈఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ఉరుకులు, పరుగులు పెట్టించిన వర్షం



ఇటుకలు తడిచిపోకుండా ప్లాస్టిక్ పరదాలు కప్పుకుంటున్న కూలీలు



నూర్చిన ధాన్యాన్ని కాటా వేయకుండానే నేరుగా సంచుల్లోకి పడుతున్న వ్యవసాయ కూలీలు

**తమిరిశ (నందివాడ), న్యూస్‌టుడే:** ఆదివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా వచ్చిన వర్షం రైతుల్ని, ఇటుక పరిశ్రమలోని కూలీలను ఉరుకులు, పరుగులు పెట్టించింది. శనివారం రాత్రి ఆకాశం మేఘావృతమై ఉన్నప్పటికీ ఆదివారం ఉదయం వాతావరణం పొడిగానే ఉంది. దీంతో ఇక వర్షం జాడలేదని రైతులు భావించారు. ఉన్నట్టుండి మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో పెద్ద పెద్ద చినుకులు పడి అందరినీ పరుగులు పెట్టించాయి. చాలామంది వరి కుప్పలు నూర్చి ధాన్యాన్ని పోతబట్టి, ఇంటికి చేర్చుకునే పనిలో ఉన్నారు. మరి కొందరు రైతులు మినుము నూర్పిళ్లు చేపట్టారు. చినుకులతో వీరంతా రక్షణ చర్యలు చేపట్టారు. ఇటుకలు తడిచిపోకుండా బట్టీ కూలీలు ప్లాస్టిక్ కవర్లు కప్పారు. రైతులు కళ్లాల్లోని ధాన్యాన్ని కాటాలు పట్టకుండానే నేరుగా సంచుల్లోకి ఎత్తి హడావుడిగా ఇళ్లకు చేర్చుకోవడం కన్పించింది.

## యంత్రాలతో మినుము కోతలు, నూర్పిళ్లు

**కౌతవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** కూలీల కొరత, మారిన వాతావరణం నేపథ్యంలో రైతులు త్వరగా మినుము కోత, నూర్పిళ్లకు యంత్రాలను విరివిగా వినియోగిస్తున్నారు. దీంతో పలు గ్రామాల్లో చిన్నా, పెద్ద యంత్రాలు కన్పిస్తున్నాయి. మండలంలోని కౌతవరం వద్ద కర్ణాటకకు చెందిన యంత్రాలతో మినుము పొలంలో ఆదివారం పనులు నిర్వహిస్తున్నారు. భాజపా మండల అధ్యక్షుడు వల్లమూడి రవీంద్రబాబు కర్ణాటకకు చెందిన హార్వెస్టర్ యంత్రంతో ఆదివారం తన 20 ఎకరాల్లోని మినుము పొలంలో కోత, నూర్పిళ్లు చేసుకుని దిగుబడులను ఇంటికి తరలించారు. ఆయన మాదిరిగానే పలువురు రైతులు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు.



కౌతవరం వద్ద యంత్రంతో మినుము కోత పనులు

# బంటుమిల్లి కాల్వ గట్టుకు రక్షణ చర్యలు

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని కౌతవరం ఇరిగేషన్ సబ్‌డివిజన్ పరిధిలో 65 వేల ఎకరాలకు సాగునీరందించే బంటుమిల్లి ఎడమ గట్టు పటిష్టతకు చర్యలు చేపట్టారు. రెగ్యులేటర్‌కు



రెండు పొక్లెయిన్‌లతో బంటుమిల్లి కాల్వ ఎడమగట్టు పటిష్టతకు చర్యలు

అనుసంధానంగా ఈ ఏడాది రక్షణగా కాంక్రీట్ గోడ నిర్మిద్దామని గుత్తేదారుడు తవ్వకం చేయగా మొత్తం రెగ్యులేటర్ ఉనికికే ప్రమాదం వాటిల్లడంతో ఆ ప్రయత్నం విరమించుకున్నారు. కాల్వలకు తాగునీరు వదిలిన నేపథ్యంలో ఎడమగట్టు పటిష్టత కోసం నేడు తిరిగి తవ్వినదాన్ని పూడ్చి గోడ స్థానంలో సరుకుబాదులతో దడిలా నిర్మిస్తున్నారు. నీటి విడుదల నిలిపివేసిన తర్వాత తిరిగి పనులు చేయనున్నారు.

# విద్యార్థికి ఉపాధ్యాయుడి దండనపై ఆగ్రహం

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని కౌతవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఓ విద్యార్థిని ఉపాధ్యాయుడు దండించాడనే కారణంతో శుక్రవారం ముస్లింలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ మేరకు వారు హెచ్‌ఎం విజయకుమారితో చర్చించారు. ఉపాధ్యాయుడి వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం 8వ తరగతి విద్యార్థులు బొమ్మల కార్డులు ఆడుతుంటే ఒక ఉపాధ్యాయుడు గమనించి తీసుకొన్నారు. వాటిని 9వ తరగతి విద్యార్థి తీసుకోగా అతడి నుంచి షేక్ భారీ అనే విద్యార్థి తీసుకొని ఆడుతుండగా ఉపాధ్యాయుడు కరుణాకర్ అతడిని దండించారు. ఈ నేపథ్యంలో సదరు విద్యార్థి గురువారం రాత్రి జ్వరంతో బాధపడగా తల్లితండ్రులు వాకబు చేయగా విషయం బయటపడింది. దీంతో ముస్లిం పెద్దలు అలీం, అల్లాభక్షు, జిలాని, అజం తదితరులు పాఠశాలకు వచ్చి ప్రశ్నించారు. దీనిపై హెచ్‌ఎం విజయకుమారి మాట్లాడుతూ ఉపాధ్యాయుడిని తాను మందలించానన్నారు. ఆయనకు కొద్ది రోజుల కిందటే తలకు శస్త్రచికిత్స జరిగిందన్నారు. తన సంచిలోంచి వస్తువులు తీసి ఆడటంతో ఆయన ఈ చర్యకు పాల్పడ్డారని చెప్పడంతో పాటు ఉపాధ్యాయుడు క్షమాపణలు చెప్పడంతో వారు శాంతించారు.